
అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

● డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ఆమె వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ 14, రెవెన్యూ 3, ఎల్‌డబ్ల్యూఎస్, లేక్స్, హౌసింగ్, ఎలక్ట్రికల్, ఎలక్షన్స్, ఫైనాన్స్‌తో సహా పలు విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 49 అర్జీలు రాగా, వాటిలో కూకట్‌పల్లి 24, సికింద్రాబాద్- 11, శేరిలింగంపల్లి 8, చార్మినార్ జోన్ 4, ఎల్బీనగర్ 2 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, రఘుప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, అడిషనల్ సీపీపీ గంగాధర్ హాజరయ్యారు.

సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి


విద్యార్థులకు అన్నదానం చేసిన విజయకృష్ణారెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని లేబాకు నారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, డా బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి సూచించారు. దివంగత సీఎం డా.వైస్.రాజశేఖర్‌రెడ్డి, తన తండ్రి లేబాకు నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లోని ఆశ్రయ్ ఆకృతి సంస్థ విద్యార్థులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు లేబాకు తేజశ్విని పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో అన్నదానం

అమీర్‌పేట, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వ్యాధులతో బాధపడుతున్న రోగుల కోసం అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పండ్లు, పాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, కూతురు నర్సింహ, కట్ట బలరాం, సుమిత్‌సింగ్, వనం శ్రీనివాస్, పోతరాజు కుమార్, సంతోష్, శ్రీలక్ష్మి, రాణికౌర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు అందజేత


మహిళకు సరుకులు అందజేస్తున్న నీలిమ

సనత్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న పలువురికి పీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ నిత్యావసరాలు అందించారు. దాసరం బస్తీ, అల్లాదిన్ కోఠి బస్తీలలో పర్యటించి గుడిసెలలో నివసిస్తున్న పేద కుటుంబాలకు సరుకులు అందజేశారు. వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవడానికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సహాయం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కమల్‌రాజ్, రమేశ్, ఐవాన్, అడ్మా, అతిక్ మొహసిన్, ఎస్ఎస్ రావు, ఎస్ఎస్ రెడ్డి, కృష్ణయాదవ్, రాజేశ్వరి, రజనీకాంత్, సోఫియా, ఖమర్, విజయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఫార్ములా-4 విజేతగా అఖిల్


నాగచైతన్యతో హైదరాబాద్ రేసర్ అఖిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా జరిగిన ఫార్ములా-4 రెండో అంచె పోటీల్లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టు డ్రైవర్ అఖిల్ విజేతగా నిలిచాడు. చెన్నై వేదికగా జరిగిన ఈ పోటీలు సోమవారం ముగిశాయి. అఖిల్ 30 నిమిషాల 0.3445 సెకన్లలో రేసును ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. తొలి ల్యాప్‌లో కారులో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వెనుకంజ వేసిన అఖిల్ ఆ తర్వాత అద్భుతమైన ప్రదర్శన కనబర్చి విజేతగా నిలిచాడు. అహ్మదాబాద్ రేసర్ నందర్ ద్వితీయ స్థానం, బెంగుళూరు రేసర్ జేడెన్ తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. హైదరాబాద్ జట్టు యజమాని, టాలీవుడ్ హీరో నాగచైతన్యతో కలిసి అఖిల్ ట్రోఫీ అందుకున్నాడు.


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జాజుల, బీసీ సంఘాల నాయకులు

48 గంటల్లో బీసీ కులగణనకు చర్యలు తీసుకోవాలి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు బీసీ కులగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ కుల సంఘాల జేఏసీ అన్ని జిల్లాల కలెక్టరేట్‌లను ముట్టడించింది. ఇందులో భాగంగా సోమవారం జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన కోసం ప్రభుత్వం 48 గంటల్లో రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కులగణన చేయకుండా, రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే ఈ నెల 3వ వారంలో లక్షలాది మందితో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఓ వైపు రాహుల్ గాంధీ బీసీల జపం చేస్తూ పర్యటనలు చేస్తుంటే మరోవైపు బీసీలకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తీవ్ర స్థాయికి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగాని బాలరాజుగౌడ్, వేముల వెంకటేష్, బిమని మంజరి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నరేష్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ పాల్గొన్నారు.

మూడు రోజుల నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వరద నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా ప్రాంతాల్లో ప్రధాన రహదారులు దెబ్బతినగా.. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో ప్రజలకు కొంత మేర ఉపశమనం లభించింది.


జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలో విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అవే తిప్పలు..

మూడో రోజూ తెరిపిలేని వర్షం

● లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరద నీరు ● అధికారుల చర్యలతో కొంతమేర ఉపశమనం


బోరబండ సైట్-2లో గుంతలు పడిన రోడ్డు


బోరబండలో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బాబా

బోరబండ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోరబండ డివిజన్‌లో రోడ్లు ధ్వంసమయ్యాయి. సైట్-2 మల్లన్నస్వామి ఆలయం ప్రధాన రహదారి నుంచి సైట్-3 ఎన్టీఆర్ విగ్రహం వరకు, పెద్దమ్మనగర్ రోడ్డుతో పాటు కార్మికనగర్ ప్రధాన రహదారిలోని హనుమాన్ ఆలయం వద్ద రెండు బొమ్మల వరకు అక్కడక్కడ గంతలు ఏర్పడి రోడ్డు శిథిలమైంది. వీటితో పాటు పలు బస్తీల్లోని అంతర్గత రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. మ్యాన్‌హోళ్లపై ఉన్న మూతలు కుంగి దెబ్బతిన్నాయి. పాడైన రోడ్లు, మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్

బోరబండ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కోరారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, మ్యాన్‌హోళ్ల మూతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ భరత్, అత్యవసర సేవల విభాగం మేనేజర్ మల్సూర్ ఉన్నారు.

ఫలించిన జీహెచ్‌ఎంసీ ప్రయోగం


కృష్ణానగర్‌లో మ్యాన్‌హోల్స్ తెరిచి వరద నీరు వెళ్లేలా చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రయోగం ఫలించింది. నగరంలో వర్షం పడిందంటే సోషల్ మీడియాలో యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్ పూర్ణ టిఫిన్ సెంటర్ వీధిని వరద ముంచెత్తే వీడియోలు ప్రత్యక్షమయ్యేవి. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10, 36.. గాయత్రి హిల్స్, వెంకటగిరి వంటి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద కృష్ణానగర్ వీధులను ముంచెత్తుతుండేది. చాలా సందర్భాల్లో షాపులు, ఇళ్లు సైతం మునిగిపోయేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పెద్ద పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా వీటి అనుసంధానం ఆగిపోయింది. అయితే సోమవారం కురిసిన వర్షానికి వరద నీరు ఆగకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రయోగాత్మకంగా వ్యవహరించారు. మ్యాన్‌హోల్స్ మూతలను తెరిచిపెట్టడంతో వరద నీరు మొత్తం పైప్‌లోకి వెళ్లడంతో సమస్య తగ్గింది. మ్యాన్‌హోల్స్ మూతలు తెరిచిన క్రమంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపలాగా ఇద్దరు సిబ్బందిని నియమించారు. జీహెచ్‌ఎంసీ పనితీరు పట్ల కృష్ణానగర్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ తీగలపై ఒరిగిన భారీ వృక్షం

పంజాగుట్ట, సెప్టెంబర్2(ఆంధ్రజ్యోతి): ఆనంద్‌నగర్ కాలనీలోని మసీద్ వద్ద భారీ వృక్షం విద్యుత్ తీగలపై ఒరగడంతో రెండు స్తంభాలు పక్కకు ఒరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెట్టు కొమ్మలు తొలగించారు. పనులు పూర్తయిన తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

'మిలాద్ ఉన్ నబి' వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి


సీపీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరిగే మిలాద్ ఉన్ నబి ఊరేగింపు వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి మిలాద్ ఉన్ నబి ఊరేగింపులకు అనుమతివ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో సీపీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని వారికి సూచించారు. అందుకు అవసరమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహా మెహ్రా పాల్గొన్నారు.

అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించాలి

గణేశ్ నవరాత్రులపై డీసీపీ సూచన


మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ సమితి నిర్వాహకులు సమన్వయంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ సూచించారు. బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో సోమవారం వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి, శానిటేషన్, ఫైర్, నీటిపారుదల శాఖలతో పాటు పలు విభాగాల అధికారులు, మండపాల నిర్వాహకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలకు లోబడి ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. డీజే, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని చెప్పారు. ఇప్పటి వరకు వెస్ట్ జోన్ పరిధిలో మండపాల ఏర్పాటుకు వెయ్యికి పైగా ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్షకు నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు చదువుకోవడానికి నగరానికి వచ్చారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా నిమజ్జన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీలు ప్రశాంతి, రజినీకాంత్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, శాంతిభద్రతల విభాగం ఏసీపీలు వెంకట్‌రెడ్డి, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పంజాగుట్టలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు

ఆస్పత్రి నిర్లక్ష్యంతో భర్త మరణించాడని మహిళ ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన భర్త మరణించాడని ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణానగర్‌లో నివసించే ముద్రబోయిన పద్మ కూలి పనులు చేసుకుంటుంది. ఆమెకు 2001లో దుర్గయ్యతో వివాహం కాగా ఇద్దరు కుమారులు. ఈ నెల 1న పద్మ భర్త దుర్గయ్యకు జ్వరం రావడంతో యూసుఫ్‌గూడలోని మాక్స్‌ఎయిడ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా కాసేపటి తర్వాత అతడు మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. భర్త మరణంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడని, వారిపై చర్యలు తీసుకోవాలని పద్మ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో ఆర్పీఐ(ఏ) బలోపేతానికి కృషి

పంజాగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) జాతీయ కార్యదర్శి, తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం శివ నాగేశ్వరరావుగౌడ్ అన్నారు. త్వరలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని నియమిస్తామన్నారు. సోమవారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని కార్యవర్గాలను రద్దు చేసినట్లు తెలిపారు. పార్టీని మరింత సమర్థవంతంగా నడిపే నాయకులను చేర్చుకుంటామని.. త్వరలోనే హైదరాబాద్‌లో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించి రాందాస్ అథవాలే సమక్షంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా, మండల, గ్రామీణ కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. పార్టీ నేతలు కొంపల్లి ప్రభుదాస్, బి.నాగేశ్వరరావు, దీన పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్

తెలంగాణలోనూ జనసేన పార్టీ పటిష్టతకు కృషి

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనూ జనసేన పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా మోతీనగర్ జనసేన ఆధ్వర్యంలో పీఆర్ నగర్‌లోని జెండా దిమ్మె వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని బలపర్చేందుకు కిందిస్థాయి నాయకత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పవన్ సీఎం స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పలువురికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

జీవితంలో ఉద్యోగ విరమణ ముఖ్యమైన ఘట్టం

వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి


ఉద్యోగ విరమణ చేసిన వారితో ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్2 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉద్యోగ విరమణ ముఖ్యమైన ఘట్టమని వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. వాటర్‌బోర్డు పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జనరల్ మేనేజర్లు సహా 10 మంది ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందినవారిని ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వాటర్‌బోర్డు లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి కుటుంబ సభ్యులతో సమయం గడిపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. ఉద్యోగ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగంతో మరో కారును ఢీకొట్టిన కారు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వేగంగా కారు నడిపిన వ్యక్తి మరో కారును ఢీకొట్టిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని పిడుగురాళ్లకు చెందిన ఎం.గోపి ఎర్రగడ్డలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తన యజమాని నరేంద్రకుమార్‌తో పాటు కారులో వెళ్తున్న గోపి పెట్రోల్ బంక్‌కు వెళ్లేందుకు మైత్రివనం వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గోపికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యజమాని ఇంట్లో బంగారు నగలు చోరీ చేసిన డ్రైవర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న యజమాని ఇంట్లో విలువైన బంగారు నగలు చోరీ చేసిన డ్రైవర్‌తో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్రబోయిన మురళి(22) ఫిలింనగర్‌లోని ఓ ఇంట్లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. యజమాని ఇంట్లో బంగారు నగలు ఉన్నట్లు గుర్తించిన మురళి తన తమ్ముడు ముద్రబోయిన నవీన్ (20), స్నేహితుడు జట్టు సాంబశివరావు (24)తో కలిసి పథకం పన్నాడు. యజమాని తన చిన్న కుమారుడి ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న బంగారు నగలు, వాచీలు, అమెరికన్ డాలర్లు చోరీ చేశాడు. చోరీ చేసిన నగలతో ఏపీలోని కృష్ణా జిల్లా కాటూరుకు వెళ్లాడు. బంగారు నగలు, డబ్బు పోయిన సంగతి గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు కాటూరులో నగలు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.



మహాకాళి ఆలయంలో నిర్వహించిన రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో రుద్రహోమం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో సోమవారం రుద్ర హోమం ఘనంగా జరిగింది. అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించిన రుద్ర హోమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మహాకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. మహాకాళి ఆలయ కార్యనిర్వాహణాధికారి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైన్‌లో ఉచిత శిక్షణ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జనహిత సేవా ట్రస్ట్, జీఎస్‌పాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ట్యూటర్ మమత తెలిపారు. రసూల్‌పురాలోని స్వామినారాయణ టెంపుల్ సమీపంలో నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలనుకునే వారు 9281471685 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె ఓ ప్రకటనలో సూచించారు. సెట్విన్ పాఠ్యాంశాల ఆధారంగా కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైన్, గార్మెంట్ మేకింగ్, ఎంబ్రాయిడరీ ట్రైనింగ్, డిప్లొమా ఇన్ మైక్రోసాఫ్ట్ ఆఫీస్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె వెల్లడించారు.



బౌద్ధనగర్‌లో కేక్ కట్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

బౌద్ధనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం బౌద్ధనగర్‌లో ఘనంగా నిర్వహించారు. పవన్ అభిమాని శివాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాజు, సత్తిరెడ్డి, ఆనంద్, సన్నీ, సాయి, బాచి, సాయిదత్తు, నగరపు శ్యామ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి ఈనెల 1వ తేదీన అర్ధరాత్రి కార్ఖానా ఎస్‌బీఐ సమీపంలో నడుచుకుంటూ వెళుతున్నాడు. వేగంగా దూసుకు వచ్చిన ఆటో అతడిని ఢీకొట్టడంతో తలకు, ఎడమ కాలుకు, తీవ్ర గాయాలయ్యాయి. 100 డయల్ కు ఫోన్ చేయగా కార్ఖానా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందినట్లు కార్ఖానా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొల్లారంలో చెట్టు కూలి వ్యక్తికి గాయాలు



గాయాలతో రాజేష్

తిరుమలగిరి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బొల్లారం చింతల్ బజార్‌లోని ఓ ఇంటి మీద భారీ వృక్షం కూలింది. ఇంట్లో ఉన్న రాజేష్(40)కి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు రాజేష్‌ను చికిత్స నిమిత్తం బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. తల, కుడి చేయికి గాయాలు కావడంతో వైద్యులు కట్లు కట్టారు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ సిబ్బంది చెట్టును తొలగించారు. తిరుమలగిరి తహసీల్దార్ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడికి ప్రభుత్వం ద్వారా వచ్చే పరిహారం అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ. బాల్‌రాజ్ బాధితుడిని పరామర్శించారు. నష్టపరిహారాన్ని అందజేయడానికి కృషి చేస్తామని, విషయాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు.

లాలాపేటలో యువతి అదృశ్యం



ప్రియదర్శిని

అడ్డగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కాలేజీకని వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం లాలాపేటలోని వినోబానగర్‌కు చెందిన ప్రియదర్శిని(19) విద్యానగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతుంది. రోజు లాగే గత నెల 29న కాలేజీకని వెళ్లిన ఆమె సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై బంధువులు స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. తల్లి లావణ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి ...



దాన్య కుమార్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్ లాలాగూడ ఇందిరానగర్‌కు చెందిన దాన్య కుమార్ (57) కొద్ది రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. అతని సోదరుడు ఇంట్లో ఉంటున్నాడు. ఆగస్టు 30న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన దాన్యకుమార్ ఆరోజు రాత్రి వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలిం లేకపోయింది. సోదరుడు శోభన్‌బాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె బకాయి ఇవ్వలేదని వ్యక్తిపై దాడి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అద్దె ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేసిన వ్యక్తిని యజమానులు చితకబాదారు. చిక్కడపల్లి ఎస్‌ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి సాయిబాబా గుడి వద్ద నరేష్, చోటు సోదరుల ఇంట్లో మహ్మద్ రఫిక్(33) అద్దెకు ఉంటున్నాడు. యజమానుల సూచన మేరకు ఇంటిని ఆదివారం ఖాళీ చేశారు. అద్దె రూ. 2 వేలు బకాయి ఉన్నాడు. అద్దె బకాయి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి మూన్ కేఫ్ వద్ద టీకొట్టు నడుపుతున్న రఫిక్‌ను చితకబాదారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోటు పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో పేకాట రాయుళ్ల అరెస్టు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసిన మల్కాజిగిరి ఎస్‌ఓటీ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని మల్కారంలో ఓ ఫామ్‌హౌస్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌ఓటి పోలీసులు దాడులు చేసి నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.1,16,00 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జవహర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు

అధికారులు సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



సీతాఫల్‌మండి కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, విపత్తులను ఎదుర్కొనేందుకు ఆయా విభాగాల అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్, ఆరోగ్యశాఖతో పాటు వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు సామల హేమ(సీతాఫల్‌మండి), కంది శైలజ(బౌద్ధనగర్), సునీత(మెట్టుగూడ), ప్రసన్నలక్ష్మీ(అడ్డగుట్ట)లతో కలిసి ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న నేపథ్యంలో అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో నెలకొన్న సమస్యలపై అధికారులు, కార్పొరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ అధికారులు, కార్పొరేటర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలకు అండగా నిలవాలని, అధికారయంత్రాంగంతో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ భూపతిగౌడ్(మారేడుపల్లి) అధికారులు ఆశాలత, వేంకటేశ్వర్, స్వర్ణలత, కౌశిక్, శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటన

బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వలన ఇబ్బందులు పడే వారిని ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. చెట్లు పడిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పూడిక తీతాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు కరాటేరాజు, రాజేశ్, టీఆర్‌టీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ ముఠా అరెస్ట్

- 200 సీసీ ఫుటేజీల పరిశీలన
- బైక్ నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రేష్మి పెరుమాల్, అరెస్ట్ చేసిన నిందితులు (ముసుగు ధరించిన వారు)

అడ్డగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అండర్‌గ్రౌండ్ కేబుల్ చోరీ చేసిన ముఠా సభ్యులు 14 మందిని బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్ వివరాలు వెల్లడించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ సంస్థకు చెందిన కాపర్ కేబుల్స్ చోరీ అవుతున్నాయని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 200 సీసీ ఫుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. బైక్ నంబర్ ఆధారంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు కేబుల్ చోరీ చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10 లక్షల విలువ చేసే 120 కిలోల కాపర్ వైర్ల బండిల్, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు వీరే..

హయత్‌నగర్‌కు చెందిన వల్లపు వినోద్(27), బందన్ వీరన్న(32), వేముల శ్రీను(22), గుంజా రాములు(23), వేముల రాజేష్(19), గోగుల వినోద్(35), వేముల ఏసు(35), వేముల నాగరాజు(26), వల్లపు వినయ్(19), వేముల సైదులు(30), గుంజా కృష్ణ(42), బంద్రి ప్రవీణ్(21), రాంబాబు(25), కె. శ్రీనివాస్(22)ను అరెస్ట్ చేశారు. కె. రమేష్(33), సత్యనారాయణ (58), మహేష్ పరారీలో ఉన్నారు.

మహాకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



లాల్‌బజార్‌లోఅన్నదానం చేస్తున్న బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ



బోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

తిరుమలగిరి సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని మహాకాళి దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి బోర్డు మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్ ప్యారసాని భాగ్యశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్, వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సీనియర్ నాయకుడు రుక్మయ్య, రాజా రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వేణుగోపాల్, జాన్, ఆనంద్, భాస్కర్, శ్రీను, హన్మంతు, అనురాధ రెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో..

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాం ముగింపు, సోమవారం అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లిలోని అమ్మవారి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలోని అమ్మవారిని వెండి కిరీటంతో ప్రత్యేక అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్, ప్రముఖ పారిశ్రామికవేత్త, హనుమాన్ జీ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ప్రకాష్ భాటియాలు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అజిత్, ప్రేమ్ ముదిరాజ్, రామారావు, నరసింహ, నరేందర్ పాల్గొన్నారు.



కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

నకిలీ బంగారాన్ని అసలైందిగా నమ్మించి మోసం

- బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరు నిందితుల రిమాండ్

ఉప్పల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారాన్ని అసలైన బిస్కెట్ బంగారమని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ. 8.95 లక్షలు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోసపోయానని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఉప్పల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహించే నరేందర్ వద్ద శ్రీకాకులం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పిండి గ్రామానికి చెందిన బొడ్డు ఓంకార్ పనిచేస్తాడు. ఓంకార్ తన యజమానికి సత్తెనెపల్లికి చెందిన వాసు అనే వ్యక్తిని పరిచయం చేస్తూ అతని వద్ద దుబాయ్ నుంచి తెచ్చిన బిస్కెట్ బంగారం ఉందని, తక్కువ ధరకే వస్తుందని చెప్పాడు. దీంతో బంగారం చూపించమన్నాడు. అసలైనదని తేలితే కొనుగోలు చేస్తానని నరేందర్ చెప్పాడు. ముందే వేసుకున్న పథకం ప్రకారం బంగారు పూత పూసిన నకిలీ బంగారం బిస్కెట్‌కు ఓ మూలన అరతులం అసలైన బంగారం ముక్కను అతికించారు. నరేందర్‌ను ఉప్పల్ శిల్పారామం వద్దకు రమ్మని అతని ముందు ఆ బంగారు బిస్కెట్ నుంచి అసలైన బంగారం ముక్కను విడగొట్టి ఇది అసలైందో కాదో పరిశీలించుకోవాల్సిందిగా సూచించారు. నరేందర్ ఆ బంగారాన్ని తనకు తెలిసిన బంగారం దుకాణంలో చెక్ చేసుకుంటే అది అసలైన బంగారమేనని తేలింది. దీంతో నరేందర్ ఓంకార్, వాసులకు రూ.9.85 లక్షలు ఇచ్చి మొత్తం బంగారు బిస్కెట్ కొనుగోలు చేశాడు. చివరకు తాను కొనుగోలు చేసింది నకిలీ బంగారమని, మోసపోయానని తెలుసుకొని సరూర్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఉప్పల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారినుంచి నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ బీబ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వరరావు



చిలకలగూడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా

బౌద్ధనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం సీతాఫల్‌మండి, చిలకలగూడలో నిర్వహించారు. సీతాఫల్‌మండి రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వరరావు(జగ్గు), ఇమ్రాజ్, జగదీశ్ గౌడ్, జహంగీర్, నిక్కుసింగ్, జగన్ తదితరులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిలకలగూడలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బాలాంజనేయస్వామి ఆలయచైర్మన్ నాగులూరి సాయిబాబా పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జలందర్ రెడ్డి, అంజి, వెంకట్, శంకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం బొల్లారం డౌటన్ బజార్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఆరోగ్యశ్రీ, పావల వడ్డీ రుణాలు లాంటి సంక్షేమ పథకాలను సృష్టించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలరాజ్, సతీష్ తదితరులు ఉన్నారు



వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సికింద్రాబాద్ సర్కిల్‌లో నీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ ప్రత్యేక బృందాలు

వరదనీటి తొలగింపునకు చర్యలు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీహెచ్‌ఎంసీ మరింత అప్రమత్తమైంది. వర్షాలకు ఉత్పన్నమవుతున్న సమస్యల పరిష్కారానికి సత్వరమే రంగంలోకి దిగేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో వర్షాలకు తలెత్తున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఉప కమిషనర్ సుభాష్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వరదనీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న పాయింట్లను గుర్తించి అక్కడికి చేరుకుంటున్నారు. వరదనీటిని తొలగించే పనులు చేపడుతున్నారు. సమీపంలోని డ్రైనేజీలు, నాలాల్లోకి వరదనీరు సాఫీగా చేరుకునే ఏర్పాట్లు చేపడుతున్నారు. సోమవారం అడ్డగుట్ట, ఆలుగడ్డబావి, సీతాఫల్‌మండి, లాలాపేట్ ఏరియాల్లో సుభాష్‌రావు నేతృత్వంలో ఏఈలు వేణు, కౌశిక్, డిప్యూటీ ఈఈ సువర్ణ తదితర అధికారులు పర్యటించారు. వరదనీరు నిలిచే ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని పిలిపించి, వరదనీటి తొలగించే చర్యలు చేపట్టారు. పలు చోట్ల చెట్లు నేలకొరుగుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందిని పంపించి, చెట్లు, కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నారు.



చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

- కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడలో వర్షాల కారణంగా రెండు చెట్లు కూలిపోయి విద్యుత్ సరఫరాకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ సునీత తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగించారు. నిరంతర విద్యుత్ సరఫరాకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగర్ కాలనీ, ఆలుగడ్డ బావి వద్ద వరద నీరు నిలువకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

అల్వాల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొంతమంది యువకులు వీరంగం సృష్టించిన సంఘటన ఓల్డ్ అల్వాల్ శ్రీ సాయినగర్‌కాలనీ ఫేస్-2లో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీసాయినగర్ కాలనీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొన్ని నెలల క్రితం అక్రమంగా ఒక షెడ్‌ను నిర్మించారు. అందులో కిరాణ సామాగ్రిని నిలువ చేసి ఇద్దరు వ్యాపారులు ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఓ వ్యాపారి మద్యం మత్తులో బట్టలు లేకుండా న్యూడ్‌గా వీధుల్లో తిరిగాడు. విషయాన్ని గమనించిన స్థానికులు అసభ్యంగా బట్టలు లేకుండా ఎందుకు తిరుగుతున్నావని ప్రశ్నించడంతో గోదాం యజమాని ముఖేష్ అక్కడికి వచ్చి కాలనీవాసులపై దౌర్జన్యానికి దిగాడు. కాలనీవాసులను అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో కాలనీవాసులు గోదాం యజమాని ముఖేష్, అతడి అనుచరులపై ఫిర్యాదు చేయడంతో అల్వాల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

జైపూర్-కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఆదాయపన్ను అధికారి సెల్ ఫోన్, బ్రాస్లెట్ ఉన్న బ్యాగును దొంగలు అపహరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలో నివసిస్తున్న కమల్ కుమార్ భైరవ భార్యతో కలిసి జైపూర్-కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలును దుర్గంపూర్‌లో ఎక్కారు. రైలు కామారెడ్డి వద్దకు రాగానే అతడి భార్య బ్యాగు కనిపించలేదు. అందులో రెండు సెల్‌ఫోన్లు, ఏడు గ్రాముల సిల్వర్ బ్రాస్‌లెట్ ఉంది. సోమవారం రాత్రి రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి..

జవహర్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజోతి): ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 4 తులాల బంగారంతో పాటు రూ.50 వేలు దొంగలు ఎత్తుకువెళ్లిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజనేయులు తన కుటుంబసభ్యలతో కలిసి అరుణోదయకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇటీవలే కొడుకు వివాహం కూడా చేశాడు. సైనిక్‌పురిలో మరో ఇళ్లు ఉండటంతో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అందరూ అక్కడికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 4 తులాల బంగారం, రూ. 50 వేలు కనిపించలేదు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను కూడా దొంగలు తీసుకుపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరుతో మోసం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వద్ద రూ. 2.71 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్క్‌ఫ్రమ్ హోమ్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను మోసం చేసి రూ. 2.71 లక్షల కాజేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగికి బిగ్‌ఫాక్స్ అనే కంపెనీ నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి హెచ్‌ఆర్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. తమ కంపెనీలో వర్క్‌ఫ్రం హోమ్ జాబ్స్ ఉన్నాయని చెప్పడంతో బాధితుడు అంగీకరించాడు. టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సైబర్ నేరగాళ్లు.. ఇంట్లోనే ఉంటూ బిట్‌కాయిన్స్‌లో ట్రేడింగ్ చేయాలని, అతితక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. బిట్‌కాయిన్స్ ట్రేడింగ్ లింకును పంపించి దశలవారీగా డబ్బులు పెట్టుబడిగా పెట్టి ట్రేడింగ్ చేయాలన్నారు. బాధితుడు మొదట తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి లాభాలను అందుకున్నాడు.

ట్రేడింగ్‌కు అలవాటుపడిన బాధితుడికి ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించారు. విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అకౌంట్ ఫ్రీజ్ చేశారు. ఇదేంటని ప్రశ్నించగా.. నిబంధనల ప్రకారం ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినప్పుడు 80 శాతం డబ్బులు చెల్లించాలని, లేదంటే అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయడం కుదరదని చెప్పారు. బాధితుడు రూ. 2,71,400 చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయకుండా ఇంకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీసైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన

ముషీరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బైబిల్ హౌస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సూచించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ భానుప్రియ, ఏఎన్‌ఎం లక్ష్మీబాయి పాల్గొన్నారు.